సికెల్‌సెల్‌పై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రక్తదానం చేస్తున్న యువకుడు



పౌష్టికాహార కిట్లను అందజేస్తూ..

శ్రీకాకుళం కల్చరల్:

సికెల్ సెల్ ఎనిమియా వ్యాధిపై అవగాహన అవసరమని వక్తలు అన్నారు. ప్రపంచ సికెల్ సెల్ దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. 'రక్తదానం చేయండి- ప్రాణాలను కాపాడండి' నినాదంతో రెడ్‌క్రాస్ కార్యాలయం నుంచి పట్టణంలో పలు వీధుల్లో ర్యాలీ సాగింది. సికెల్ సెల్ బాధితులను ఆదుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ప్రసాదరావు అన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో నిర్వహించారు. అలాగే సికెల్ సెల్ ఎనేమియా బాధిత చిన్నారులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రతినిధులు బలివాడ మల్లేశ్వరరావు, ఎ.నర్సింహరావు, డాక్టర్ నిక్కు అప్పన్న, నిక్కు హరిసత్యన్నారాయణ, పి.చైతన్యకుమార్, గొలివి రమణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు, రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్లు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తాచాటారు. పి.సాయిచందు, ఎల్.జాన్సీ, ఎ.బాలాఅధిత్య, పి.గ్రేష్, టి.ధనలక్ష్మి, ఎల్.వాసవి ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక తెలిపారు. బుధవారం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు నెలల్లో సౌకర్యాలు కల్పిస్తాం

ఎచ్చెర్ల: లావేరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో పడకలతోపాటు పరికరాలు కొరత ఉందని, ఉన్నతాధికారులతో మాట్లాడి మూడు నెలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. మండలానికి బుధవారం విత్తన పంపిణీ కోసం వచ్చిన ఆయన లావేరు పీహెచ్‌సీని సందర్శించారు. ఇక్కడ ఉన్న అన్ని గదులను పరిశీలించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు. టీడీపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

జి.సిగడాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వైద్యాధికారి పేకల సుమబిందు, సీహెచ్‌ఓ శివప్రసాదరావు ఆధ్వర్యంలో వంద మంది చిన్నారులకు టీకాలు వేశారు. ఈ టీకాలు వేయడంతో వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చన్నారు.

పరామర్శ..



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామంలో మంగళవారం అసిరితల్లి గ్రామ దేవత పండగల్లో భాగంగా నిర్వహించిన సిరిమానోత్సవంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన సూరాడ అప్పన్న, కారి పల్లేటి కుటుంబాలను శ్రీకాకుళం రిమ్స్‌లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు బుధవారం పరామర్శించారు. మంగళవారం రాత్రి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తరఫున సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను బాధిత కుటుంబ సభ్యులు, బుడగుట్లపాలెం సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు కోరారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అప్పగించటంతో బుడగుట్లపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అయ్యప్పస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగలో వేంచేసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి పాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎచ్చెర్ల: లావేరు మండల కేంద్రంలో బుధవారం వ్యవసాయ అధికారులు ఏర్పాటుచేసిన వరి విత్తనాల పంపిణీ కార్యక్రమానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ రైతులకు ఏ రకం విత్తనాలు అవసరమౌతాయో ఆ విత్తనాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అనంతరం రైతులకు విత్తనాల పంపిణీ చేపట్టారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వక్‌సేన్, ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించండి

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడి కాలువ కింద ఉన్న సాగు భూమికి ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు నీరు అందించాలని సంబంధిత అధికారులకు ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఎచ్చెర్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. నారాయణపురం కుడి కాలువలో పిచ్చి మొక్కలు, మట్టిపొరలు పేరుకుపోయాయని అధికారుల దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. ఉపాధి ఏపీఓ శోభాదేవి మాట్లాడుతూ కుశాలపురం, తోటపాలెం గ్రామాలు శ్రీకాకుళం నరగర పాలక సంస్థ పరిధిలోకి వస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే ఉపాధి పనులు చేయడం సాధ్యమన్నారు. సభ్యులు స్పందిస్తూ జల వనరులు శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని పనులు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు కనీసం స్పందించటం లేదన్నారు. ఇరిగేషన్ అధికారి మాట్లాడుతూ ఉన్నతాధికారులు దృష్టికి ఈ సమస్య తీసుకు వెళ్తామని, జూలై మొదటి వారంలో కాలువకు నీరు విడిచిపెట్టనున్నట్లు చెప్పారు. బొంతలకోడూరు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 30లో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు పనులు అసంపూర్తిగా విడిచిపెట్టారన్నారు. ఉపాధి ఏపీఓ మాట్లాడుతూ చెరువు మరమ్మతులకు రూ.9 లక్షలు మంజూరయ్యాయని, రూ.4.50 లక్షలు ఖర్చు చేసి పనులు పూర్తిచేశామన్నారు. చెరువు హద్దులు నిర్ణయం, గట్లు లేకపోవటం వంటి సమస్య వల్ల పనులు జరగలేదని, త్వరలో అంచనా వ్యయం మేరకు పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగాప్రియదర్శిని మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై గ్రామాల్లో పూర్తిస్థాయిలో సర్వే, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తాగునీటి సమస్య లేకుండా గ్రామాల్లో చర్యలు తీసుకోవాలని సభదృష్టికి సభ్యులు తెచ్చారు. మండల పరిషత్ పరిపాలన అధికారి పీవీఎస్ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ కిలారి నారాయణరావు, ఈఓపీఆర్డీ కణితి ఈశ్వరి, విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ సువ్వారి రంగనాథం, పీఆర్ఏఈ డి.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

27న విజయదుర్గ ఆలయ వార్షికోత్సవం



విజయదుర్గా అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలో వేంచేసిన విజయదుర్గ అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు భక్తుల గోత్రనామాలతో చేస్తామన్నారు. భక్తులు ముందుగా తమ పేర్లను ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న సొసైటీ సభ్యులు

రణస్థలం: పుట్టిన రోజు వేడుకల్లో అడంబరాలకు బదులు ప్రకృతిని పరిరక్షించే సంప్రదాయాన్ని బాల్య దశ నుంచే అలవాటు చేయాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కోష్ట దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తమ వంతుగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సొసైటీ సభ్యులు పి.తవిటినాయుడు, పి.రమణ, వై.లహరి, ఆర్.కృష్ణ, ఎం.వి.రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ



స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న సాయికుమార్

రణస్థలం: విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందజేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండలంలోని కోష్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎంఈఓ త్రినాథరావు, సర్పంచ్‌లు చిన్నంనాయుడు, లక్ష్మణరావు, నాయకులు పైడి శ్రీనివాసరావు, పల్లె లక్ష్మణ, స్కూల్ కమిటీ చైర్మన్ పల్లె సత్యంపాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు భేష్

నరసన్నపేట: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు బాగున్నాయని, ఇలాగే కొనసాగించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సత్యసాయి భక్తులకు సూచించారు. రెండోసారి ఎమ్మెల్యేగా రమణమూర్తి ఎన్నిక కావడంతో స్థానిక మారుతీనగర్ సాయి మందిరానికి చెందిన భక్తులు జామి వెంకటరావు, ఊణ్ణ నారాయణమూర్తి బుధవారం ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సమితి సేవలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో సత్యసాయి భక్తులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యేకు మందిరం సభ్యులు వివరించారు. వేసవి దృష్ట్యా కాలేజీ కూడలి వద్ద రెండు నెలలుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. చిత్తిరి వీధి మందిరంలో మహిళలకు చేనేత మగ్గంపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఊణ్ణ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



దోమల మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ పీహెచ్‌సీ పరిధిలోని దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, బొంతలకోడూరు బీసీబాయ్స్ వసతిగృహం, డి.మత్స్యలేశం బాలికల వసతి గృహాల్లో బుధవారం కెమికల్ పిచికారీ చేశారు. దోమ కాటు వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణలో భాగంగా మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ కె.సూర్య అప్పారావు ఆధ్వర్యంలో కెమికల్‌ను పిచికారీ చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షకులు ఆర్.సురేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్



హుద్‌హుద్ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

- పలాస ఆర్డీవో భరత్‌నాయక్

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు గురైతే కఠిన చర్యలు తీసుకోవాలని పలాస ఆర్డీవో భరత్‌నాయక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత మీదేనన్నారు. తహసీల్దార్ ఎం.సురేష్ అధ్యక్షతన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్త ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ఉండాలన్నారు. ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా, గ్రావెల్ మైనింగ్‌పై దృష్టి సారించి నిరోధించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి పౌర సేవలను తక్షణమే పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన బెండిగేటు వద్ద కొండను ఆనుకుని ఉన్న హుద్‌హుద్ ఇళ్లను పరిశీలించారు. తహసీల్దార్ ఎం.సురేష్, ఉప తహసీల్దార్ వి.గిరిరాజ్, ఎంఆర్ఐ డి.పవిత్ర, మండల సర్వేయర్ కె.తిరుపతిరావు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విత్తనపు ఉండలు దోహదం



సీడ్ బాల్స్‌ను చూపిస్తున్న విద్యార్థినులు

సంతబొమ్మాళి: పర్యావరణ పరిరక్షణకు విత్తనపు ఉండలు (సీడ్ బాల్స్) ఎంతగానో దోహదపడతాయని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.చైతన్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈకో క్లబ్ ఫర్ మిస్సింగ్ లైఫ్ కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులు బుధవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా విత్తనపు ఉండలను తయారు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు సపోటా, పనస, సీతాఫలం, చింత, కుంకుడు తదితర విత్తనాలను సేకరించారన్నారు. వీటిని మట్టిని ఉండలుగా చేసి వాటిలో ఒక్కొక్క విత్తనం పెట్టి వాటిని ఎండబెట్టి సీడ్స్ బాల్స్‌ని తయారు చేశారన్నారు. వీటిని రోడ్డు పక్కన, చెరువు గట్లపై, కొండలపై, గుట్టలు, బంజరు భూముల్లో వేయటం ద్వారా వర్షాలకు సీడ్ బాల్స్‌లో ఉన్న విత్తనాలు మొలకెత్తి ఒకటి, రెండు సంవత్సరాల్లో వృక్షాలుగా మారతాయని అన్నారు. విద్యార్థులు 2,500 సీడ్‌బాల్స్ తయారు చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, అదికేశవరెడ్డి, తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, రవికుమార్, విజయలక్ష్మి, మార్కండేయులు, కృష్ణవేణి, రోజా పాల్గొన్నారు.

వంద రోజుల పనుల కల్పనే లక్ష్యం

కవిటి: గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా అధికశాతం కుటుంబాలకు వంద రోజుల పనికల్పనే లక్ష్యంగా క్షేత్ర, సాంకేతిక సహాయకులు విధులు చేపట్టాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేతనదారుల్లో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు నిర్దేశించిన మేరకు పనుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. గృహనిర్మాణశాఖకు సంబంధించి 90 రోజుల పనిదినాల లక్ష్యాల్ని పూర్తి చేయాలన్నారు. ఏపీవో టి.మోహనరావు, టీఏలు శ్యాంసుందర్, దివ్య, నీలాంబర్ ఉన్నారు.

దహన ఖర్చులు పెంపుపై హర్షం



సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు మరణం అనంతరం దహన ఖర్చులను ప్రభుత్వం రూ.25 వేలకు పెంచింది. దీనిపై ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బుధవారం సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు ఎస్.అప్పారావు మాట్లాడుతూ.. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు మరణిస్తే దహనఖర్చులు రూ.25 వేలకు పెంచాలని సంఘం తరఫున సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావుకి పలుమార్లు వినతిపత్రాలు అందించామన్నారు. ఆయన సహృదయంతో స్పందించి దహన ఖర్చులు పెంచుతూ బుధవారం సర్క్యులర్ జారీ చేశారని చెప్పారు. సర్క్యులర్ రావడానికి ప్రధాన కారకులైన ఈయూ విశ్రాంత రాష్ట్ర అధ్యక్షుడు వి.వి.కె.రాయ్, ప్రధాన కార్యదర్శి కె.ఆర్.ఆంజనేయులు, పి.దామోదరరావుకు ధన్యవాదాలు తెలియజేశారు. సంఘ నాయకులు కొర్లాం గణేశ్వరరావు, ఎస్.ఎస్.ఆర్.శర్మ, జె.ప్రసాద్, ఆర్.పి.రావు ఉన్నారు.

స్విమ్మింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షునికి సన్మానం



సూర్యారావుని సన్మానిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా ఎన్ని సూర్యారావు నియామకంపై ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సూర్యారావును అసోసియేషన్ తరఫున బుధవారం దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. జిల్లాలో ఉత్తమ స్విమ్మర్లను తయారు చేయాలని కోరారు. న్యాయవాదుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు, బీసీ న్యాయవాదుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, న్యాయవాదులు పి.లక్ష్మీపతి, ఎన్ని రమేష్, జి మన్మథరావు, బి.అప్పలనాయుడు, కొమ్ము రమణమూర్తి, బి.వి.రమణ, పి.జోగారావు ఉన్నారు.

విద్యార్థుల్లో అభ్యసనాశక్తి మెరుగుపడాలి



టెక్కలి మెయిన్ స్కూల్‌లో విద్యార్థుల అభ్యసనా శక్తిని తెలుసుకుంటున్న అధికారులు

టెక్కలి: విద్యార్థుల్లో అభ్యసనా శక్తి మెరుగుపడే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సమగ్ర శిక్షా ఏఎంవో జి.లక్ష్మీనారాయణ అన్నారు. ఎస్‌సీఆర్‌టీ రూపొందించిన 90 రోజుల విద్యా ప్రవేశ్ బేస్ లైన్ టెస్ట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మెయిన్ స్కూల్, శ్రీనివాసనగర్ ఎంపీపీఎస్ స్కూల్, కంద్రవీధి ఎంపీపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం బేస్ లైన్ టెస్ట్‌ను నిర్వహించారు. సుమారు ఆరు రకాల అంశాలతో విద్యార్థుల అభ్యసన శక్తిని నమోదు చేశారు. ఈయనతో పాటు డైట్ సీనియర్ లెక్చరర్ ఎ.గౌరీశంకర్, ఎంఈవోలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావుతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎక్కువ కేసుల రాజీకి కృషిచేయాలి

- జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత



మాట్లాడుతున్న సివిల్‌జడ్జి ప్రసన్నలత

కోటబొమ్మాళి: ఈనెల 29న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీకి కృషిచేయాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్నలత అన్నారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు మేనేజర్లతో లోక్ అదాలత్‌పై బుధవారం సమీక్షించారు. వివిధ కేసుల్లో ఇరువర్గాల వారితో మాట్లాడి రాజీ కుదర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ ఎస్.తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, న్యాయవాదులు డి.నర్సింహమూర్తి, పి.అర్జునరావు, పల్లి వాసుదేవరావు, ఉప్పాడ తిరుమలరావు, బి.ధర్మారావు ఉన్నారు.

యంత్రంతో విత్తనాల చల్లడంపై అవగాహన



యంత్రంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామానికి చెందిన రైతు ఇప్పిలి రామ్మోహనరావుకి చెందిన పొలంలో బుధవారం విత్తనం, ఎరువు ఒకేసారి వేసుకునే యంత్రంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ వెంకటరావు మాట్లాడతూ ఒకేసారి విత్తనం, నేలకు కావాల్సిన ఎరువును ఈ యంత్రం ద్వారా వేసుకోవచ్చన్నారు. రైతుకు ఆర్థికంగా ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రస్తుతం రామ్మోహనరావుకు చెందిన ఆరు ఎకరాలలో యంత్రం సాయంతో సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలకార్మికులను పనుల్లో పెట్టొద్దు

కవిటి: నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలు లేదా ఇతర రంగాల్లో బాలకార్మికులను పనుల్లో పెడితే కఠిన చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని అధికారులు హెచ్చరించారు. బాల కార్మికుల గుర్తింపు, నియంత్రణలో భాగంగా బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కవిటి, సోంపేటలలోని వివిధ దుకాణ సముదాయాలు, వస్త్ర దుకాణాలు, బేకరీలు, హోటళ్లు, బైక్ మెకానిక్ షెడ్లను అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయకుమార్ తనిఖీ చేశారు. 18 ఏళ్ల లోపు బాల బాలికలను పనిలో పెట్టుకున్నట్లయితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బాలల రక్షణ విభాగం నుంచి సామాజిక కార్యకర్త డి.మధుర మీనాక్షి, చైల్డ్ హెల్ప్ లైన్ నుంచి సూపర్‌వైజర్ ఎస్.వైకుంఠరావు, బ్రిడ్స్ చైల్డ్ లైన్ టీమ్ సభ్యులు స్వాతి, సోంపేట మండల విద్యాశాఖ అధికారి జోరాడు, కవిటి ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఆర్.పి.కృష్ణారావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగోన్నతిపై బదిలీ

బూర్జ: మండలంలోని కొల్లివలస డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ గురుకులం ప్రధానాచార్యులు నూక రామకృష్ణ ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. గ్రేడ్ ఒన్ ప్రిన్సిపాల్‌గా అనకాపల్లి జిల్లా సబ్బవరంలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన బుధవారం తెలిపారు. విధి నిర్వహణలో సహకరించిన సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.